## నీ పాట తెలంగాణ బలగాన్ని మళ్లీ చాటింది...

హైదరాబాద్: ప్రముఖ జానపద కళాకారుడు బలగం మొగులయ్య మృతిపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కేటీఆర్) సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పాటకు చలించని హృదయం. పాట ద్వారా తెలంగాణ ప్రేమిక జీవనాన్ని ఆవిష్కరించారని చెప్పారు. మాయమైపోతున్న కుటుంబ సంబంధాలను మళ్లీ గుర్తుచేశాయి. మొగులయ్య మరణించినా పాట రూపంలో బతికే ఉంటారని చెప్పారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.'నీ పాటకు చెమర్చని కళ్ళు లేవు, చలించని హృదయం లేదు. నీ పాట ద్వారా తెలంగాణ ప్రేమిక జీవనాన్ని ఆవిష్కరించావ్. మాయమైపోతున్న కుటుంబ సంబంధాలను మళ్లీ గుర్తు చేసింది. మొగులన్నా.. నీ పాట తెలంగాణ బలగాన్ని మళ్లీ చాటింది. మానవీయకోణాన్ని ఆకాశమంత ఎత్తులో నిలిపింది. మొగులయ్య గారు మరణించినా పాట రూపంలో బతికే ఉంటారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలి. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలి' అని ట్వీట్ చేశారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :258 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 20-12-2024 | పేజీలు:4 వెల: 2.00


## భూ భారతి చట్టం ప్రకటనపై బీఆర్ఎస్ నోటీసులు




హైదరాబాద్,డిసెంబర్ 19 : రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పేరుతో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువస్తున్నది. ఈ నేపథ్యంలో భూ భారతి చట్టంపై వివిధ పత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలు గుప్పించింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చింది. శాసనసభ హక్కులను రక్షించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ శాసనసభా పక్షం కోరింది. డిసెంబర్ 19న (గురువారం) దినపత్రికల్లో చట్టానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చిందని, ఆమోదం పొందని బిల్లును చట్టంగా ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో భారీ ప్రకటనల ద్వారా ప్రజలను ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందని పేర్కొంది. శాసనసభలో చర్చ దశలో ఉన్న బిల్లును చట్టంగా పేర్కొనడంతో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 ప్రకారం సభా హక్కులకు హాని జరిగిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త రెవెన్యూ చట్టం 'భూ భారతి'తో రెవెన్యూ రికార్డుల నిర్వహణలో అనేక మార్పులు జరగనున్నాయి. రాష్ట్రంలోని ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో 'భూదార్' నంబర్‌ను కేటాయించనున్నారు. ఇకపై భూ క్రయవిక్రయాలు జరిపే సమయంలో ముందుగా ఆ భూమిని సర్వే చేయించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ధరణి పోర్టల్‌లో అందుబాటులో ఉన్న 'ఇన్‌స్టెంట్ మ్యుటేషన్'ను కొ త్త చట్టంలోనూ కొనసాగించారు. క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. కానీ, వారసత్వంగా జరిగే భూముల బదిలీ (ఫౌతీ)లో కొత్త నిబంధన తీసుకొచ్చారు. తాసిల్దార్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ జరిగినా.. మ్యుటేషన్ చేసే అధికారాన్ని మాత్రం ఆర్డీవోకు అప్పగించారు. నిర్ణీత కాలంపాటు (30 రోజులు) మ్యుటేషన్ చేయకుండా నిలిపివేస్తారు. ఆలోగా ఆ భూమి పై ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ప్రక్రియ పూర్తి చేస్తారు. కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38–ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హకులపై మ్యుటేషన్ అధికారాలను ఆర్డీవోకు కట్టబెట్టారు. ఇప్పటివరకు ధరణి పోర్టల్‌లో మొత్తం 33 మాడ్యూళు ఉండగా.. భూభారతిలో వాటిని 6కు తగ్గించనున్నారు. భూమి పట్టాలో కేవలం రైతు పేరు మాత్రమే ఉండగా.. ఇకపై అనుభవదారు కాలమ్ సహా మొత్తం 11 కాలమ్‌లు ఉంటాయి. పార్ట్–బీ కేసులు పరిష్కారమైనవారి వివరాలను భూ రికార్డుల్లో ఎక్కించి, పాస్ బుక్ ఇచ్చేలా మార్పులు చేశారు. తాసిల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్లకు అధికారం ఇచ్చారు. సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. గ్రామ కంఠం, ఆబాదీలకు హకుల రికార్డును రూపొందిస్తుంది. 2014 వరకు సబ్ రిజిస్ట్రార్ల వద్ద రికార్డుల్లో ఉన్న 'ప్రభుత్వ భూముల' వివరాలను ప్రస్తుతం ధరణిలో ఉన్న డాటాతో సరిపోల్చనున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఆయా సర్వే నంబర్లలోని భూములన్నింటినీ ప్రభుత్వ భూములుగా పరిగణించి నిషేధిత జాబితాలో చేర్చుతామని తెలిపింది. దీంతో 2014కు ముందు పొరపాటున ప్రభుత్వ భూమిగా నమోదై.. 2014 తర్వాత వివాదం ముగిసి, పట్టాభూమిగా మారిన భూములన్నీ ఇప్పుడు మళ్లీ నిషేధిత జాబితాలోకి చేరనున్నాయి. కొత్త రెవెన్యూ చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలను 3 నెలల్లో తీసుకురానున్నారు.

## పార్లమెంట్ వద్ద గందరగోళ వాతావరణం

న్యూఢిల్లీ,డిసెంబర్19: పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. పరస్పర తోపులాటల్లో బిజెపి ఎంపిలు ఇద్దరికి గాయాలయ్యాయి. ఆయనను హుటాహుటిని ఆస్పత్రికి తరలించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. అటు అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం కూడా నిరసన చేపట్టారు. ఇరువర్గాల ఆందోళనలతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఇందులో భాజపాకు చెందిన ఇద్దరు ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తోయడం వల్లే వీరు గాయపడ్డారని భాజపా ఆరోపిస్తోంది. పార్లమెంట్‌లోని మకరద్వారం వద్ద ఉన్న గోడ ఎక్కి ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు ప్లకార్డులు చూపిస్తూ ఆందోళన చేపట్టారు. అదే సమయంలో అక్కడకు ఎన్డీయే కూటమి ఎంపీలు వచ్చారు. వీరిని లోపలికి వెళ్లకుండా విపక్ష నేతలు అడ్డుకున్నారని భాజపా ఆరోపించింది. ఈ క్రమంలోనే కొంత గందరగోళం చోటుచేసుకుని భాజపా ఎంపీలు ముకేశ్ రాజ్‌పుత్, ప్రతాప్ చంద్ర సారంగి కిందపడి గాయపడ్డారు. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్‌కు ఐసీయూలో చికిత్స అందించారు. మరో ఎంపీ ప్రతాప్ చంద్ర సారంగి తలకు గాయమైంది. వీరి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు స్పందించారు. 'ఇద్దరు ఎంపీల తలలకు దెబ్బలు తగిలాయి. సారంగి తలకు లోతైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. తలకు కుట్లు వేశాం. ముకేశ్ రాజ్‌పుత్ స్పృహ కోల్పోయిన స్థితిలో వచ్చారు. వైద్యం అందించాక ఆయన కోలుకుని స్పృహలోకి వచ్చారు' అని వైద్యులు వెల్లడించారు. వీరిని పలువురు కేంద్రమంత్రులు, తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రధాని మోదీ ఫోన్లో పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో ఎంపీ ప్రతాప్ సారంగి మీడియాతో



మాట్లాడుతూ.. 'నేను మెట్ల వద్ద నిల్చొని ఉండగా.. రాహుల్ గాంధీ ఓ ఎంపీని నెట్టేశారు. ఆయన వచ్చి నాపై పడటంతో నేను కిందపడ్డాను' అని ఆరోపించారు. ఈ ఘటన నేపథ్యంలో రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని భాజపా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. 'జరిగిందంతా మీ కెమెరాల్లో కనబడి ఉండొచ్చు. నేను పార్లమెంట్ లోపలికి వెళ్తుండగా భాజపా ఎంపీలు నన్ను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. తోసేశారు. బెదిరించారు. మల్లికార్జున్ ఖర్గేను కూడా నెట్టేశారు. మాకు లోపలికి వెళ్లే హక్కు ఉంది. కానీ, వారు అడ్డుకుంటున్నారు. ఇక్కడ ప్రధాన సమస్య ఏంటంటే.. రాజ్యాంగంపై వారు దాడి చేస్తున్నారు. అంబేడ్కర్‌ను అవమానించారు' అని రాహుల్ దుయ్యబట్టారు. భాజపా ఎంపీలే తమను అడ్డుకున్నారని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వీడియోను కాంగెస్ 'ఎక్స్'లో షేర్ చేసింది. అంతేగాక, ప్రస్తుత వ్యవహారంపై స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ రాశారు. 'ఆందోళన సమయంలో భాజపా ఎంపీలు నన్ను నెట్టేశారు. దాంతో నా మోకాలికి గాయమైంది' అని తెలిపారు. తోపులాట ఘటనపై విచారణ జరపాలని లేఖలో పేర్కొన్నారు.

## ఆ విషయంలో తెలంగాణను ఫాలో అవుతున్న ఏపీ

హైదరాబాద్, ఔను మీరు విన్నది నిజమే. ఆ విషయంలో మాత్రం తెలంగాణను ఏపీ ఫాలో కానుంది. అదేంటీ అసలు 40 ఏళ్ల సుధీర్ఘ రాజకీయ చరిత్ర గల ఏపీ సీఎం చంద్రబాబు ఇలా ఫాలో కావడం ఏమిటని అనుకుంటున్నారా.. నేరుగా మంత్రులతో కూడా ఇదే విషయంపై చంద్రబాబు చర్చించారట. ఇంతకు తెలంగాణ ఏం చేసింది? ఏపీ ఫాలో అవుతున్న విషయం ఏంటో తెలుసుకుందాం.ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గురుకులాల్లో జరుగుతున్న ఘటనలపై సీరియస్ అయిన విషయం తెలిసిందే. అది కూడా కొందరు అధికారులపై చర్యలు కూడా తీసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాసిరకం ఆహారా పదార్థాలు ఉంటే, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఒక్క కామెంట్ ఈ సంధర్భంగా దేశ వ్యాప్త చర్చకు దారి తీసింది.మన రైతులు సన్న బియ్యం పండిస్తే, అదే బియ్యం రేషన్ షాపుల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే గురుకులాలకు కూడా మన రైతులు పండించిన బియ్యాన్ని పంపిణీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఇలా సన్న బియ్యం సాగు చేసే రైతులకు, ప్రోత్సాహం కింద ప్రభుత్వం అదనంగా రూ. 500 లు అందించింది. దీనితో తెలంగాణ రైతుల్లో సన్న బియ్యం సాగుపై అమిత ఆసక్తి ఏర్పడింది. ఈ హామీతో తెలంగాణ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడు ఇదే ఏపీ కూడా ఫాలో కానుంది. ఇటీవల సీఎం చంద్రబాబు కలెక్టర్స్ మీటింగ్ ఏర్పాటు చేసిన సమయంలో, రేషన్ బియ్యంపై చర్చ వచ్చింది. రేషన్ బియ్యంను ప్రజలు ఇష్టపూర్వకంగా తీసుకుంటున్నారా లేదా అంటూ




సీఎం ప్రశ్నించారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సన్నబియ్యం సాగుకు అందిస్తున్న ప్రోత్సాహం, రేషన్ కార్డుదారులకు అందించే తీరు గురించి వివరించారు. దీనితో సీఎం చంద్రబాబు కూడా అక్కడి అధికారులను ఈ విషయంపై ఆలోచించాలని ఆదేశించారట.రైతుల కోసం సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఇతర రాష్ట్రాలలో కూడా మనం సాగు చేసే ధాన్యం, మనకే అందితే కలిగే లాభాల గురించి చర్చలు సాగుతున్నాయి. ఈ విషయంలో తెలంగాణను ఫాలో అయ్యే రీతిలో ఏపీతో పాటు, ఇతర రాష్ట్రాలు కూడా సిద్ధం కానున్నాయట. ఏదిఏమైనా సన్నబియ్యం సాగు చేసే రైతులకు ఇదొక శుభపరిణామంగా చెప్పవచ్చు.

## మరోమారు హైడ్రా దూకుడు...



హైదరాబాద్,డిసెంబర్19: అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా మణికొండ మున్సిపాలిటీలో దూకుడు పెంచింది. హైదరాబాద్ మణికొండలోని అల్కాపురి టౌన్‌షిప్‌లో హైడ్రా చర్యలు చేపట్టింది. మార్నింగ్ రాగా అపార్టుమెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా షట్టర్లు వేసి దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు షట్టర్లను తొలగించారు. దీంతో హైడ్రా, పోలీసులను మార్నింగ్ రాగా అపార్టుమెంట్ వాసులు అడ్డుకున్నారు.గత నెల 27న మణికొండ మున్సిపల్ అధికారులు ఇక్కడి వారికి నోటీసులు ఇచ్చారు. 7 రోజుల్లో షట్టర్లు తొలగించాలని అందులో పేర్కొన్నారు. నోటీసులకు స్పందించక పోవడంతో తాజాగా గురువారం షట్టర్లను తొలగించారు. ఇందుకు హైడ్రా సాయం తీసుకున్నారు. అల్కాపురి కాలనీ లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కమర్షియల్ షెట్టర్స్ ను అధికారులు తొలగించారు . రెసిడెన్షియల్‌గా అనుమతులు తీసుకుని కమర్షియల్‌గా వ్యాపార సముదాయాలు నడిపిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో గత వారం హైడ్రా కమిషనర్ రంగనాథన్ అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ అదేశాల మేరకు అక్రమంగా నడుస్తున్న వ్యాపార సముదాయాలను గురువారం తొలగించారు. ఈ క్రమంలో అధికారులకు వ్యాపారస్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మణికొండ మునిసిపాలిటీకి లక్షల రూపాయలు కమర్షియల్ ట్యాక్స్ చెల్లించామని, ఎలా కూల్చివేస్తారంటూ వ్యాపారుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ బాడా వ్యక్తి ఒత్తిడి మేరకు కూల్చివేతలు చేసారంటూ వ్యాపారుల ఆందోళన చేపట్టారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారంటూ వ్యాపారులు మండిపడ్డారు. అల్కాపురి కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అధికారులు కమర్షియల్ షెట్టర్స్ తొలగింపుపై హైడ్రా కమిషనర్ రంగనాథన్ స్పందించారు... వ్యాపారస్తులు హైడ్రా కమిషనర్‌పై చేస్తున్న వాఖ్యలను ఖండించారు. పనికి మాలిన మాటలను వాస్తవాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని, వీటన్నింటి వెనుక స్థానిక బిల్డర్ ఉన్నారని అన్నారు. మేము వివరంగా పత్రికా ప్రకటనను విడుదల చేస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు.

## ఆ విషయంలో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పండి..



హైదరాబాద్, ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ లంచం ఆరోపణలపై విపక్షాల ఆందోళన కొనసాగుతోంది. అదానీ ఇష్యూపై జేపీసీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని, మణిపూర్ అల్లర్లపై ప్రధాని మోదీ, కేంద్రం వైఖరికి నిరసనగా ఏఐసీసీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. దీంతో బుధవారం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ ముట్టడి చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డికూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ, కేసీఆర్ వేరువేరు కాదని విమర్శించారు. అదానీ విషయంలో కేంద్రాన్ని నిలదీయాలా వద్దా.. కేసీఆర్, బీఆర్ఎస్ వైఖరి ఎమిటో చెప్పాలని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అయితే, తాజాగా.. కేటీఆర్ రాహుల్ గాంధీకి లేఖ రాశారు.కేటీఆర్ తన లేఖలో.. అదానీపై కాంగ్రెస్ ద్వంద వైఖరిని ఎండగట్టారు. ఒకవైపు మీరు అదానీని అవినీతికి చిహ్నంగా పేర్కొంటున్నారు. అతను మోదీ 'క్రోనీ క్యాపిటలిస్ట్' అని అంటున్నారు. మరోవైపు అదే అదానీని తెలంగాణలోని మీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి, మంత్రులు కౌగిలించుకుంటున్నారు. అసలు అదానీ విషయంలో కాంగ్రెస్ పార్టీ స్టాండ్ ఏమిటో తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అదానీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తోందా.. లేక ప్రజలను మోసం చేస్తున్నారా అనే విషయంపై స్పష్టం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. ఢిల్లీలో అదానీతో పోరాటం అంటూ తెలంగాణ ప్రభుత్వం దోస్తీ చేస్తోందని కేటీఆర్ ప్రస్తావించారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

హైదరాబాద్, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పురపాలక, జీహెచ్ఎంసీ, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుల్లో ఈ అంశం లేదని చెప్పారు. మూడు బిల్లులకు బీఆర్ఎస్ తరఫున సవరణలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. తమ సవరణలను ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అసరమైతే సభలో డివిజన్‌కు కూడా పట్టుబడుతామని స్పష్టం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. నవంబర్‌లోగా కులగణన పూర్తి చేస్తామని అధికారపార్టీ చెప్పిందన్నారు. కులగణనపై తేల్చకుండా చట్ట సవరణకు అసెంబ్లీలో ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లు ప్రస్తావించకపోవడం బీసీలను మోసం చేయడమేనని ఆరోపించారు.

## జగిత్యాల సబ్ జైలులో గుండెపోటుతో ఖైదీ మృతి!

జగిత్యాల:జగిత్యాల సబ్ జైలులోని ఓ ఖైదీ గుండెపోటుతో మృతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం చనిపోయాడు. జగిత్యాల జిల్లా మాల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన క్యాతం మల్లేశంకు బుధవారం మధ్యాహ్నం గుండె నొప్పి వచ్చింది.సబ్ జైల్ నుండి హుటాహుటిన అతడిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. నిన్నటి నుంచి చికిత్స పొందుతున్న మల్లేశం ఆసుపత్రిలోనే ఈరోజు కన్నుమూశాడు.

## అసెంబ్లీ లో మంత్రి కోమటిరెడ్డి,హరీష్ రావుల లడాయి..

హైదరాబాద్: అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని నీటి సమస్యలను గురించి సంబంధిత మంత్రిని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు జోక్యం చేసుకుని మంత్రులే ప్రశ్నలు వేస్తే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందని అన్నారు. దీంతో వారి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఏ హోదాలో అడుగుతున్నారని హరీశ్‌రావును మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. మంత్రులు రాజకీయ ప్రసంగాలు మాని సమాధానాలు సూటిగా చెబితే రోజుకు పది ప్రశ్నలకు సమాధానాలు వస్తాయని, ప్రస్తుతం మూడు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందని ఈ సందర్భంగా హరీశ్ రిప్లయ్ ఇచ్చారు.

కేబినెట్ ఉంటుండగా

మంత్రి కోమటి రెడ్డి ప్రశ్నలకు హరీశ్‌రావు అభ్యంతరం తెలిపారు. కేబినెట్ నిర్ణయం అంటే సమిష్టి నిర్ణయమని, క్వశ్చన్ అవర్‌లో ఒక మంత్రి మరొక మంత్రిని ప్రశ్న అడగడం ఏంటని హరీశ్‌రావు అన్నారు. ఇలా అయితే.. ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందన్నారు. కొత్త సంప్రదాయన్ని సభలో తీసుకురావద్దని స్పీకర్ ప్రసాద్‌ను హరీశ్ కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారని, వారి హయాంలోనే మూసీ మురికి కూపంగా మారిందని మండిపడ్డారు. అప్పుడు వారు సరిగ్గా చేసిఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని హరీశ్‌రావు విమర్శించారు.

ఏ హోదాలో అడుగుతున్నారు?

అయితే.. ఈ విషయాన్ని తనను ఏ హోదాలో అడుగుతున్నారని హరీశ్‌రావును మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. ఆయనకు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. ఏడాదిగా ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అసలు అసెంబ్లీలో ఫ్లోర్ లీడర్ కేసీఆరా.. హరీశా? అంటూ ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై తాము పోరాడుతున్నామని లెక్చర్లు ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎందుకు సభకు రావట్లేదో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. హరీశ్‌రావు డిప్యూటీ ఫ్లోర్ లీడారా?



ఆయనది ముందు ఏ హోదానో చెప్పాలని ఫైర్ అయ్యారు.

నిర్లక్ష్యం చేసింది మీరే.. మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. నల్గొండ ప్రజల గురించి, తన గురించి సభలో మాట్లాడే నైతిక హక్కు హరీశ్ రావుకు లేదని మండిపడ్డారు. కాగా, హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 పనులు పూర్తి చేసి కాళేశ్వరం జలాలను నల్లగొండ జిల్లా, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించేదే బీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో, తాము ఏం చేశామో అన్న విషయంపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.

మూడు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుంది : హరీశ్‌రావు

ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నకు సూటిగా జవాబు వచ్చినట్లయితే పది ప్రశ్నలకు ఆన్సర్ వచ్చే అవకాశం ఉందని హరీశ్‌రావు అన్నారు. ప్రతిరోజు మూడు నాలుగు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందని, ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలన్నారు. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే తాము కల్పించుకోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వాటికి మరోసారి అవకాశం ఇవ్వొద్దని స్పీకర్‌ను హరీశ్‌రావు కోరారు.

## సంపాదకీయం

శుక్రవారం 20-12-2024

# ఉపాధి వేటలో వలస బాట

ఉన్న ఊరిలో ఉపాధి కరవై చాలామంది వలస పోతున్నారు. భూములున్నా నీటి వనరులు లేక, కరవు కాటకాలతో రైతులు సైతం ఊళ్లు వదిలి వెళుతున్నారు. రాయలసీమ, తెలంగాణ, కోస్తాంధ్ర... ప్రాంతాల తేడాలు లేకుండా అన్నిచోట్ల నుంచీ వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉన్న ఊరిలో ఉపాధి కరవై చాలామంది వలస పోతున్నారు. భూములున్నా నీటి వనరులు లేక, కరవు కాటకాలతో రైతులు సైతం ఊళ్లు వదిలి వెళ న్నారు. రాయలసీమ, తెలంగాణ, కోస్తాంధ్ర... ప్రాంతాల తేడాలు లేకుండా అన్నిచోట్ల నుంచీ వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం సందర్భంగా...జీవనోపాధి, ఉన్నత విద్య కోసం దేశంలో చాలామంది స్వగ్రామాలు వదిలి వలస బాట పడుతున్నారు. ఉద్యోగం, వ్యాపారంలో మంచి అవకాశం దొరికితే పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా వెళ్తున్నారు. ఇలాంటి వలసలు జాతీయ స్థాయిలో 28.9శాతంగా ఉన్నాయని కేంద్ర గణాంకాల శాఖ గతంలో వెల్లడించింది. మరోవైపు, వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో ఏకంగా 90 లక్షల మంది గ్రామాల నుంచి పట్టణాలకు వలస పోతున్నారు. గతంలో లాక్‌డౌన్ సమయంలో ఓ సంస్థ చేపట్టిన సర్వే ప్రకారం దేశంలో అత్యధికంగా అయిదున్నర కోట్ల మంది వలస కార్మికులు నిర్మాణ రంగంలో పని చేస్తున్నారు. వారిలో 5.1 కోట్ల మంది పేర్లు కనీసం సంక్షేమ బోర్డుల్లో నమోదు కాలేదని వెల్లడైంది. దేశవ్యాప్తంగా వలస కూలీల దినసరి వేతనం కనీస స్థాయికన్నా తక్కువగానే ఉంది. బతుకుదెరువు కోసం పొట్టచేత పట్టుకొని వలస వెళు న్న శ్రామికులు మోసాల బారిన పడటం పెద్ద సమస్యగా మారింది. కొంతమంది వలస వెళ్లినచోట డబ్బులు అందక అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. మరికొంతమంది ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో గత ఆరేళ్లలో 38,748 భారతీయ వలస కార్మికులు మరణించగా, వారిలో అయిదు వందల మంది తెలుగు రాష్ట్రాల కార్మికులు ఉన్నారని లోక్‌సభకు విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

**చదువులకు ఆటంకం**

ఎంతోకొంత నైపుణ్యాలు కలిగినవారు, నైపుణ్యం లేని కార్మికులు కువైట్, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఖతర్, ఒమన్, యూఏఈ లాంటి దేశాలకు ఎక్కువగా వలస వెళ్తున్నారు. ఒక సర్వే ప్రకారం దేశంలో సుమారు 10 కోట్ల మంది వలస కార్మికులు ఉన్నారు. వారిలో 22 లక్షల మంది ఉత్తరాంధ్రకు చెందినవారే. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సుమారు 15 లక్షల మంది వలస వెళ్తుండటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. శ్రీకాకుళంలో చేపల వేటపై ఆధారపడే 80 వేల కుటుంబాల వారు ఏటా ఏప్రిల్ రాగానే వలస బాట పడుతున్నారు. రాయలసీమ ప్రజలు గుంటూరు ప్రాంతంలో మిరప ఏరడానికి, తెలంగాణలోని సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతంలో పత్తి తీసేందుకు వెళ్తున్నారు. అలా వెళ్లినవారు ఆరేడు నెలలకుగాని తిరిగి ఇంటి ముఖం చూడటం లేదు. వలస వెళ్లిన ప్రాంతాల్లో పలువురు వివిధ ప్రమాదాల బారిన పడి మరణిస్తుండటం విషాదకరం. కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ వలస వెళ్తే, పిల్లలను ఇంటి వద్ద విడిచి పెడుతున్నారు. వృద్ధులు ఇంటికి కాపలాగా ఉండిపోతున్నారు. దీంతో పిల్లల చదువులు ముందుకు సాగడం లేదు. తల్లిదండ్రులు వలస వెళ్తే కొందరు పిల్లలు కూడా వారి వెంట వెళ్తున్నారు. ఇలాంటి చిన్నారుల చదువులు మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి నెలకొంటోంది. సాధారణంగా వీరి కోసం ప్రభుత్వాలు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి. గతంలో ఇలాంటివి ఏర్పాటు చేసినా మొక్కుబడిగా నిర్వహించారు. దీంతో విద్యార్థులు అక్కడ ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఏపీలో కూటమి ప్రభుత్వం సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుపై దృష్టి సారించడం గమనార్హం. వలస జిల్లాల్లో స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు, పొదుపు సంఘాల సభ్యులకు సీజనల్ హాస్టళ్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా చర్యలు చేపట్టారు.

**అక్రమాలకు తావులేకుండా...**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం సత్ఫలితాలను ఇవ్వడం లేదని, వేతనాలు గిట్టుబాటు కావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన పనులు గుర్తించాలి. కూలీలకు గిట్టుబాటు అయ్యేలా వేతనాలు చెల్లించడం వంటి చర్యలు చేపట్టాలి. అవినీతి అక్రమాలకు తావు లేకుండా నిజమైన కూలీలకు న్యాయం జరిగేలా చూడాలి. ఇందుకోసం అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ చేపట్టాలి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని వలసల నివారణకు పలు కార్యక్రమాలు చేపట్టాలి. పేద ప్రజలకు స్వగ్రామాల్లోనే ఉపాధి మార్గాలు చూపాలి. అప్పుడే వలసలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.

# జమిలితో పాటు..మరిన్ని సంస్కరణలు అవశ్యం !

న్యూఢిల్లీ,రాజకీయ సంస్కరణల విషయంలో అన్ని పార్టీలదీ ఒకటే దారి. తమకు అనుకూలంగా చట్టాలను మార్చు కుంటున్నారు. అన్నీ ఒకే తాను ముక్కలు గనక వాటి గురించి అంతా తలూపుతున్నారు. ఇప్పుడు జమిలి ఎన్నికల విషయంలో రాజీపడ్డట్లు కనిపించినా అందరికీ అవసరమే. కాకపోతే తరచూ ఎన్నికలను రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయి. ఎన్నికల్లో లబ్ది పొందేందుకు, అధికారం పొందేందుకు మాత్రమే వాటి తాపత్రయం తప్ప..ప్రజలపై ప్రేమతో కాదు. ఇకపోతే జమిలితో పాటు అనేక సంస్కరణలు తేవాల్సి ఉంది. ప్రధానంగా రాజ్యాంగం,దేశంపై అవగాహన లేని క్రిమినల్ చరిత్ర ఉన్నవారు కూడా రాజకీయ నాయకులుగా ఎదుగుతున్నారు. వీరిని ఎన్నికలకు దూరం పెట్టగలగాలి. చదువు సంధ్యలు లేకుండా ఏకంగా పార్లమెంటులో అడుగుపెడుతున్నారు. అలాగే ఒకటికి మించి రెండుమూడు చోట్ల పోటీ చేసే పద్దతికి స్వస్తి చెప్పాలి. ఎందుకంటే కనీసం మూడుచోట్ల లేదా రెండుచోట్ల పోటీ చేస్తున్నారు. దీంతో గెలిచాక ఒకటి వదులుకున్నా, దాని ఖర్చు ప్రజలపై పడుతోంది. ఇలా పోటీ చేసి, రాజీనామా చేస్తే ఆ ఖర్చును వ్యక్తి లేదా, పార్టీ భరించేలా నిబంధన పెట్టాలి. లేదా అలాంటి వెసులుబాటు లేకుండా చేయాలి. మరో విషయం ఏమంటే ఎమ్మెల్యేలు,ఎంపిల జీతభత్యాలు, పెన్షన్లను రద్దు చేయాలి. వారికి ఇచ్చే భత్యాలు కూడా లెక్కకు మించి ఉంటున్నాయి. ఈ జమిలి ఎన్నికల సంస్కరణలోనే వీటిని చేర్చాలి. అప్పుడే రాజకీయ సంస్కరణకు అర్థం ఉంటుది. జమిలి ఎన్నికల ద్వారా తరచూ ఎన్నికలు జరిగే అవకాశం ఉండదు. కనక దేశాభివృద్ధికి దోహద పడుతుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభిప్రాయపడ్డారు. ఇది ముమ్మాటికీ నిజం. తరచూ ఎన్నికల వల్ల ఖజానా గుల్ల కావడంతో పాటు, ప్రజలను సమస్యల నుంచి తప్పిస్తున్నారు. ఒకేసారి ఎన్నికల ప్రతిపాదన కార్యరూపం దాల్చిన తర్వాత ఎన్నికల పక్రియ సరళతరం కానుంది. ఓ రకంగా చెప్పాలంటే అది అభివృద్ధికి మరింత ఊతమిస్తుంది. తద్వారా దేశాభివృద్ధికి దోహదపడుతుంది. ఏటా ఓట్ల కోసం వచ్చే నేతలతో ఓటర్లు విసిగిపోయారు. ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు తప్ప..తమ హయాంలో జరిగిన అవినీతి గురించి మాట్లాడడం లేదు. అందుకే ప్రజలు తరచూ అటువంటి పరిస్థితి కోరుకోవడం లేదు. జమిలి బిల్లు పార్లమెంటుకు వచ్చిన తరుణంలో ఇంకా అనేక ప్రతిపాదనలను జోడించి రాజ్యాంగ సవరణకు పూనుకో వాలి. సమిలి కార్యరూపం దాలిస్తే..ఏదో ఒక ఎన్నిక కోసం ఓటర్లు ఏటా పోలింగ్ బూత్‌లకు వెళ్లాల్సిన పని ఉండదు. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. ప్రస్తుతమున్న జీడీపీకి అదనంగా మరో 1.5శాతం పెరుగుతుంది. ఒకవేళ ఇదే జరిగితే జీడీపీ 10శాతం పెరగడానికి ఎక్కువ సమయం పట్టదు. దాంతో ప్రపంచంలోనే మూడు, నాలుగో ఆర్థిక శక్తిగా మన దేశం నిలుస్తుంది. ఓట్లు అడగాల్సి వస్తే.. అభివృద్ధికి సంబంధించిన హామీలు ఎందుకు అమలు చేయడంలేదు అన్న ప్రశ్నకు ప్రజలకు సమాధానం ఇవ్వాలి. అయితే జమిలి ఒక్కటే పరిష్కారం కాదు. తరచూ ఎన్నికల నిరోధంతో పాటు, రాజకీయ పార్టీల పెత్తనానికి కళ్లెం వేయగలిగేలా చూడాలి. ప్రజాధనం వృధాను అరికట్టగలగాలి. ఈ క్రమంలో దేశంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న చర్చకు తెరపడింది. ఎట్టకేలకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఒకే దేశం - ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టారు. అంతకుముందు ఈ రెండు బిల్లులకు డిసెంబర్ 12న కేంద్ర



మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ఈ బిల్లును డిసెంబర్ 17న కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అయితే ఈ బిల్లు అమలయ్యాక ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వం పడిపోతే ఆ పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు చాలా మందిలో మెదులుతోన్న ప్రశ్న.రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోయిన తర్వాత వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎలా పని చేస్తుందనేది ఆ ప్రశ్నలలో ఒకటి. ఈ బిల్లు అమలు తర్వాత ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వం పడిపోతే, ఏం చేయాలి అన్న విషయాన్ని చర్చించాలి. అయితే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులో అనేక రకాల నిబంధనలు రూపొందించారు. అవిశ్వాస తీర్మానం వల్లనో, లేదా మరేదైనా కారణంతోనో ప్రభుత్వం పడిపోతే.. అలాంటి పరిస్థితుల్లో ఏం చేస్తారనే నిబంధన కూడా ఇందులో ప్రస్తావించారు. ఈ నిబంధన ప్రకారం, ఆ సమయంలో ఆ రాష్ట్రంలో మళ్లీ మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలి. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. కొత్త అసెంబ్లీ పదవీకాలం వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు మాత్రమే ఉంటుంది. అంతే కాకుండా ఎన్నికల నిర్వహణకు ముందు అవసరమైన అన్ని అవసరాలను పూర్తి చేయాలని కూడా ఎన్నికల కమిషన్‌ను బిల్లులో ఆదేశించింది. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల కోసం ఎన్నికల సంఘం కూడా ముందస్తుగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని బిల్లులో వివరంగా తెలిపింది. బిల్లులో తెలిపిన నిబంధన ప్రకారం, లోక్‌సభ లేదా అసెంబ్లీని మధ్యలోనే రద్దు చేయాల్సి వస్తే, మిగిలిన కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు నిర్వహిస్తారు. బిల్లులో ఆర్టికల్ 82 (ఎ), 172, 327లను చేర్చాలనే ప్రతిపాదన కూడా ఉంది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే నిబంధన 82 (ఎ)లో ఉంది. ఇది కాకుండా, 83లో పార్లమెంటు సభల పదవీకాలానికి సంబంధించిన నిబంధన కూడా ఉంది. అంతే కాకుండా సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రపతి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయాన్ని కూడా చట్టంలో పేర్కొన్నారు. అయితే 2029 లోక్‌సభ ఎన్నికలు మునుపటిలా నిర్వహించనున్నారు. ఆ తర్వాత వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు అమలులోకి వస్తుందని తెలుస్తోంది. ఈ బిల్లుకు అనుకూలంగా 269 ఓట్లు, వ్యతిరేకంగా 198 ఓట్లు వచ్చాయి. దీంతో బిల్లుపై చర్చలో జేపీసీకి అభ్యంతరం లేదని హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేయడంతో దీనిని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ప్రతిపాదించారు. సమిలితో పాటు పైన ప్రస్తావించిన అనేక అంశాలను చట్టంలో పొందుపరిస్తేనే బిజెపి చిత్తశుద్ధి చాటుకోగలదు. అందుకు అన్ని రాజకీయ పార్టీలు ఇందుకోసం పట్టబట్టాల్సి ఉంది.

# దడ పుట్టిస్తున్న సైబర్ మోసాలు...



హైదరాబాద్,నాణేనికి బొమ్మా బొరుసూ ఉన్నట్లుగానే సమాజంలో మంచీ చెడూ కూడా పక్కపక్కనే ఉంటాయి. ఏది మంచో, ఏది చెడో గుర్తించి మసలుకోవడంపైనే మన తెలివితేటలు ఆధారపడి ఉంటాయి. నానాటికీ కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానమూ ఇంతే. దీంతో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో, అన్ని దుష్ప్రయోజనాలూ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెచ్చుమీరుతున్న సైబర్ నేరాలకు ఈ సాంకేతిక పరిజ్ఞానమే ఆధారభూతమవుతోం ది. కొత్తరకం పరిజ్ఞానాన్ని ఇట్టే అందిపుచ్చుకుని అవకాశాలు వెతుక్కోవడంలో భారతీయులు ముందుంటారు. మూడు దశాబ్దాల క్రితం సమాచార సాంకేతిక పరిజ్ఞానం కొత్తగా వెలుగుచూసినప్పుడు సంబంధిత కోర్సులను అందరికంటే ముందుగా అభ్యసించి అవకాశాలను వెతుక్కుంటూ పాశ్చాత్య దేశాల్లో పాగా వేసినవారిలో అగ్రగణ్యులు మనవాళ్లే. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో ఐటి రంగంలో భారతీయులు అగ్రస్థానాల్లో ఉండటానికి కారణం వారి ముందుచూపే. అయితే ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకుని మోసాలు చేయడంలోనూ మనవాళ్లు ఆరితేరిపోయారనేదే విచారించదగిన అంశం. లింక్ పంపించి దాన్ని క్లిక్ చేస్తే కోట్ల రూపాయలు వచ్చి ఒళ్లో వాలతాయని నమ్మించి మోసం చేయడం, పిన్ నంబర్ చెబితే వెంటనే ఖాతాలో లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తామంటూ బురిడీ కొట్టించడం పాత పద్ధతి. అమాయక జనాన్ని మోసం చేస్తే వచ్చే లాభం అంతంతమాత్రంగానే ఉంటుంది కాబట్టి, బాగా చదువుకున్నవారినే టార్గెట్ చేసుకుని, వలలోకి లాగి కోట్ల రూపాయలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్ల బెడద ఇప్పుడు ఎక్కువైపోయిం ది. ఇటీవల భాగ్యనగరానికి చెందిన ఓ డాక్టర్‌ను ట్రేడింగ్ బిజినెస్ పేరిట సైబర్ నేరగాళ్లు బుట్టలో వేసుకుని, 34 విడతలుగా పదకొండు కోట్లకు పైనే తమ ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. మరో సంఘటనలో ఓ వితంతు మహిళని ట్రాయ్ అధికారులమంటూ బెదిరించి ఐదున్నర కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ఈ రెండు సంఘటనల్లోనూ బాధితులు, మోసగాళ్లు భారతీయులే కావడం, పైగా విద్యాధికులే కావడం విశేషం. తాజాగా డిజిటల్ అరెస్టు పేరిట బెదిరింపులు ఎక్కువయ్యాయి. సైబర్ నేరగాళ్లు తమను తాము పోలీసులమనో, కోర్టు అధికారులమనో పరిచయం చేసుకుని నకిలీ అరెస్టు వారెంట్లు లేదా సమన్లు పంపించి బెదిరిస్తారు. ఆన్‌లైన్‌లో జరిమానా చెల్లిస్తే గండం గట్టెక్కవచ్చని నమ్మబలుకుతారు. ఈ తరహా డిజిటల్ అరెస్టులపై అవగాహన లేకపోవడంతో బాధితులు నిజమేనని నమ్మి మోసపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ సైబర్ నేరగాళ్ల ఆగడాలు రానురాను పెచ్చుమీరుతున్నాయి. ఇటీవల ఒడిశాకు చెందిన ఓ రిటైర్డ్ డాక్టర్‌ను బురిడీ కొట్టించి కోటి రూపాయలు కాజేసిన నిందితుడు నిజామాబాద్‌లో పట్టుబడ్డాడు. మరో సంఘటనలో సైబర్ ముఠాలకు ఇతరుల వ్యక్తిగత సమాచారాన్ని చేరవేసి, పరోక్షంగా సైబర్ నేరాలకు సహకరిస్తున్న ఓ యువకుడిని నిర్మల్‌లో పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణలో సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపడంలో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అవిశ్రాంతంగా కృషి సలుపుతోంది. గత నెలలో రాష్ట్రంలో పలు నేరాలతో సంబంధం ఉన్న 48 మందిని అరెస్టు చేసి, కటకటాల వెనక్కు నెట్టారు. ఉద్యోగాలపేరిట ఇక్కడి యువతకు గాలం వేసి, కంబోడియాకు తరలించి వారి చేత సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాలోని కీలక వ్యక్తిని అరెస్టు చేయడం ఇటీవల తెలంగాణ సైబర్ పోలీసులు సాధించిన ఘనవిజయాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ఇటీవల 'మన్ కీ బాత్' లో ప్రధాని ఆందోళన వెలిబుచ్చడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. బాధితులు సకాలంలో పోలీసులకు సమాచారం చేరవేయడంలో జాప్యం చేయడం, నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంలో బ్యాంకు అధికారుల ఉదాసీన వైఖరి కూడా మోసగాళ్లకు వరంగా మారుతున్నాయి. ఈ విషయంలో పోలీసులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేస్తే తప్ప నేరాలకు ముకుతాడు పడే అవకాశం లేదు. సైబర్ నేరాలపై ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు పోలీసులు శ్రమిస్తున్నా ఫలితం అంతగా కానరావడం లేదు. ఈ విషయంలో పోలీసులతోపాటు బ్యాం కులు, స్వచ్ఛంద సంస్థలు కూడా నడుం బిగించవలసిన అవసరం ఉంది. సైబ ర్ మోసాలపై హైస్కూలు స్థాయి నుంచి కోర్సులు ప్రవేశపెట్టే విషయాన్ని ప్రభు త్వాలు పరిశీలించాలి. ప్రతి పోలీస్ స్టేషన్లోనూ సైబర్ సెల్ ఏర్పాటు చేసి, నిపు ణులను నియమించడం వల్ల సాధ్యమైనంత వరకూ నేరాల వ్యాప్తిని నిరోధించవచ్చు.

# అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ చేపట్టండి

అమరావతి, ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ వ్యవహారంపై వెంటనే జేపీసీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని మోదీ ప్రభుత్వాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలాగే గౌతమ్ అదానీ వద్ద వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ముడుపులు తీసుకున్న వ్యవహారంలో ఏసీబీ రంగంలోకి దింపి విచారణ చేపట్టేలా ఆదేశించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో గౌతమ్ అదానీపై చర్యలు తీసుకోవాలంటూ ఏఐసీసీ పిలుపు మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్ యాత్ర చేపట్టారు. అయితే ఈ యాత్రను నగర పోలీసులు అడ్డుకున్నా రు. దీంతో పోలీసుల చర్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. అదానీ, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మధ్య ముడుపుల వ్యవహారంపై నిజానిజాలు నిగ్గు తేల్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. స్వయంగా ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌కి అదానీ గ్రూప్ రూ.1,750 కోట్లు లంచం ఇచ్చారని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నివేదిక ఇస్తే.. కేంద్రంలో మోడీ కానీ.. రాష్ట్రంలో చంద్రబాబు కనీసం నోరు విప్పడం లేదంటూ వైఎస్ షర్మిల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ సైతం జరిపించడం లేదన్నారు. అదానీ మీద ఈగ కూడా వాలనివ్వడం లేదని కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ప్రపంచం ముంగిట దేశం పరువు, ఖ్యాతిని అదానీ తీస్తే.. ఆయన వద్ద లంచాలు తీసుకొని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరువు తీశారని మండిపడ్డారు. స్వలాభం కోసం విద్యుత్‌ను అధిక

# కాంగ్రెస్ కార్యకర్తల అత్యుత్సాహం...

గుంటూరు, కాంగ్రెస్ కార్యకర్తల అత్యుత్సాహంతో ఓ యువ ఐపీఎస్ వివాహం పెళ్లిపీటలపై ఆగిపోయింది. దీంతో పెళ్లికుమార్తె తల్లికి గుండెపోటు వచ్చింది. పెళ్లి కొడుకు ఇంటిముందు పెళ్లికూతురు బంధువులు ఆందోళన చేయగా.. చివరకు ఐపీఎస్ పెళ్లికి అంగీకరించాడు. గుంటూరు నగరానికి చెందిన ఐపీఎస్ అధికారితో తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కుమార్తెతో పెళ్లి నిశ్చయించారు. దీంతో డిసెంబర్ 17న సాయంత్రం గుంటూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పెళ్లికి ఏర్పాట్లు చేశారు. అయితే ఈ పెళ్లి వేడుకకు తెలంగాణ నుంచి భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు గుంటూరుకు తరలివచ్చారు. ఆ క్రమంలో పెళ్లి కుమారుడు ఇంటి నుంచి కాంగ్రెస్ జెండాలతో భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లేందుకు నాయకులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం మంచిది కాదని పార్టీ కేడర్‌ను ఐపీఎస్ బంధువులు వారించారు. అందుకు వధువు తరఫు బంధువులు ససేమిరా అన్నారు. ఈ నేపథ్యంలో వరుడు ఐపీఎస్ అధికారి కావడంతో.. పార్టీ జెండాలు మంచిది కాదంటూ.. పెళ్లి కుమార్తె బంధువులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ వధువు బంధువులు అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో యువ ఐపీఎస్ అధికారి ఆగ్రహం కట్టలు తెంచుకొంది. ఈ పెళ్లి చేసుకొనేందుకు ఐపీఎస్ అధికారి నిరాకరించాడు. ఈ విషయం తెలిసి.. పెళ్లి కుమార్తె తల్లికి తీవ్ర గుండెపోటు వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కేడర్.. ఐపీఎస్ అధికారి నివాసం వద్ద ఆందోళన చేపట్టింది. ఈ ఆందోళనపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. ఐపీఎస్ అధికారిని వివాహానికి ఒప్పించేందుకు.. చర్చి పెద్దలు, పాస్టర్లు చర్యలు చేపట్టారు. గత అర్ధరాత్రి 12.00 గంటల నుంచి బుధవారం ఉదయం 7.00 గంటల వరకు చర్చలు జరిగాయి. చివరకు ఈ చర్చలు ఫలప్రదమయ్యాయి. బుధవారం.. అంటే ఈ రోజు సాయంత్రం.. అదే వివాహ వేదికగా పెళ్లి ముహూర్తం ఇరు వర్గాల పెద్దలు కలిసి నిశ్చయించారు. ఈ ఐపీఎస్ అధికారి గుజరాత్ కేడర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అదీకాక.. జిల్లాలో సదరు కాంగ్రెస్ నాయకుడికి భారీగా కేడర్ ఉంది. దీంతో తమ నాయకుడు కుమార్తె వేడుకకు వారంతా గుంటూరు తరలి వచ్చారు.

# భవానీపై ఒక్క గీత పడిన ఊరుకోను

అమరావతి, భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో జరుగుతోన్న ఏర్పాట్లలో భాగంగా ఇంజనీరింగ్ విభాగం అధికారుల పనితీరుపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీ షా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్క భవానీకి గీత బడిన ఊరుకోనంటూ ఇంజనీరింగ్ విభాగం అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖ అధికారులకు కీలక సూచనలు చేశారు. భవానీ దీక్ష విరమణ నేపథ్యంలో ఏర్పాట్లును ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బుధవారం ఉదయం పరిశీలించారు అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భవానీలు ఎక్కడ ఇబ్బంది పడకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కాలినడకన వచ్చే భవానీలకు హోల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేశామని వివరించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో హోల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేశామన్నారు. వారి కోసం ప్రత్యేకంగా వాష్ రూమ్స్‌తోపాటు టాయిలెట్స్ సైతం సిద్ధం చేశామన్నారు. భవానీ భక్తుల కోసం ఏర్పాటు చేసిన యాప్ ద్వారా ఎంత మంది భవానీలు వస్తున్నారో ముందుగానే తెలుసుకో వచ్చునని నగర పోలీస్ కమిషనర్ సీపీ రాజశేఖర బాబు వెల్లడించారు. డ్రోన్స్ ద్వారా పూర్తిగా మానిటరింగ్ చేస్తున్నామన్నారు. భవానీల దీక్ష విరమణ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 3 వేల మంది పోలీసులను బందోబస్తునకు వస్తున్నా రని వివరించారు. ప్రతి ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే భవానీ దీక్ష విరమణ కార్యక్రమాలు.. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామని చెప్పారు. ఇప్పటికే శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారని తెలిపారు. అలాగే పోలీసులు, వీఎంసీ, ఆలయ అధికారులతోపాటు జిల్లా కలెక్టర్ అందరం భవానీ దీక్ష విరమణల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు. అయితే వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే విధంగా అన్న వితరణకు సంబంధించిన ఏర్పాట్లను సైతం దగ్గరుండి పరిశీలిస్తున్నామని చెప్పారు.

# మిస్టరీని ఛేదించిన పోలీసులు

గుంటూరు, పల్నాడు జిల్లా: నకరేకల్లు డబుల్ మర్డర్ కేసులో మిస్టరీ వీడింది. విచారణ జరిపిన పోలీసులు కేసును ఛేధించారు. ప్రియుడుతో కలిసి కృష్ణవేణి పక్క స్కెచ్ వేసింది. సుపారీ ఇచ్చి మరీ అన్నల హత్యలకు స్కెచ్ వేసింది. నిందితురాలు కృష్ణవేణితో పాటు ప్రియుడు దానయ్య మరో నలుగురు మైనర్లు హత్యలో పాల్గొన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కృష్ణవేణితో పాటు ప్రియుడు దానయ్య, మరో నలుగురు మైనర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. నవంబర్ 26వ తేదీన రామకృష్ణను ఇంట్లో చున్నీ బిగించి హత్య చేసి గొరంట్ల కాల్వ లో పడేశారు. అలాగే డిసెంబర్ 10న కానిస్టేబుల్ గోపి కృష్ణను ఇంట్లో చున్నీ బిగించి హత్య చేసి గుంటూరు బ్రాంచ్ కెనాల్ పడేశారు. బంధాలు, బాంధవ్యాలకు నేటి సమాజంలో విలువ లేకుండా పోతోంది. డబ్బే ప్రపంచంగా లోకం మారిపోతోంది. డబ్బు, ఆస్తి కోసం ఎంత దూరం వెళ్లేందుకైనా ఏ మాత్రం ఆలోచించరు. డబ్బు ఉంటే చాలు ఇంకేది అవసరం లేదు అన్నట్లు సమాజం తయారైంది. డబ్బుల కోసం, ఉద్యోగాల కోసం ఎంతటికైనా దిగజారిపోతున్నారు. తమ మార్గానికి అడ్డు వస్తున్నారంటే అది కన్న తల్లిదండ్రులైనా, తోడబుట్టిన వారైనా వారిని అడ్డుతొలగించేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఎవరికి ఇష్టం ఉండదు. అనేక మంది ఎంతో కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించుకుంటారు. మరికొందరికి తండ్రి వారసత్వంగా అంటే తండ్రి హఠాత్తుగా మరణిస్తే ఉద్యోగం వస్తుంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న తండ్రి.. సర్వీసులో ఉండి చనిపోతే కుమారులకు ఆ ఉ ద్యోగం వస్తుంది. అయితే తండ్రి ఉద్యోగం కోసం ఓ మహిళ చేయకూడని పని చేసి ఇప్పుడు వార్తల్లో నిలిచింది. తోడబుట్టువులు అని కూడా చూడాకుండా దారుణానికి పాల్పడింది. ఆమె చేసిన దారుణం చూసి పోలీసులే అవాక్కయ్యారు. ఆ తరువాత మృతదేహాలను కాల్వల్లో పడేసింది. కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో నకిరేకల్‌కు చెందిన పోలరాజు మృతి చెందాడు. పోలరాజు ఉద్యోగం కోసం కుమార్తె కృష్ణవేణి మర్డర్ స్కెచ్ వేసింది. అన్న గోపి, తమ్ముడు రామకృష్ణను హత్య చేసి మృతదేహాలను గుంటూరు బ్రాంచ్ కెనాల్, గోరంట్ల మేజర్ కాలువలో పడేసింది. ఆ తరువాత పోలీసులకు లొంగిపోయింది. ఆస్తి కోసం తోడబుట్టిన వారిని దారుణంగా హత్య చేసి కాలువలో పడేసిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నకిరేకల్లుకు చెందిన పోలరాజు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ప్రభుత్వ ఉద్యోగం కోసం కూతురు కృష్ణవేణి ఘాతుకానికి పాల్పడింది. తన తండ్రి ఉద్యోగం తనకు కావాలనే ఉద్దేశంతో తన తోబుట్టువులైన గోపి, రామకృష్ణలను దారుణంగా చంపేసి మృతదేహాలను కాలువల్లో పడేసింది. గోపి.. బొల్లాపల్లి స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. రామకృష్ణ నిరుద్యోగి. అయితే వీరిద్దరికీ తండ్రి ఉద్యోగం రాకుండా.. తనకే రావాలన్న ఉద్దేశంతో

# పేర్నినాని చుట్టూ బియ్యం అక్రమాలు



అమరావతి,చవక బియ్యం పథకం ఓ మాఫియాలా తయారయ్యింది. రాజకయా పార్టీల నేతలకు ఇదో ఆదాయ వనరుగా మారింది. అలాగే దీనిద్వారా వేలకోట్లు దుబారా అవుతున్నా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. రూపాయి బియ్యంతో వేలకోట్లు సంపాదిస్తున్నారు. ఎవరికి వారు దీనిపై ప్రకటనలు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. ఈ క్రమంలో రేషన్ బియ్యం దారిమళ్లింపు కథా వ్యవహారం ఏపీ రాజకీయాలను కుదిపేస్తోంది. పేర్నినాని కుటుంబం చుట్టూ ఇది తిరుగుతోంది. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పట్టుబట్టడంతో వ్యవహారం మెల్లగా బయటకు వచ్చింది. చివరకు ఇది హైకోర్టులో విచారణకు వచ్చింది. తాము తప్పు చేయలేదు కాబట్టే బియ్యం మాయంపై లేఖరాశామని పేర్నినాని ప్రకటించి ఊరుకున్నా, ఆయన దీని నుంచి తప్పించుకోలేరని అర్థం అవుతోంది. ఆయన భార్య ఇప్పటికీ అజ్ఞాతం వీడలేదు. అడ్డంగా దొరికిపోయాక బుకాయించడం దేనికని అధికారపార్టీ ప్రశ్నిస్తోంది. పేదల బియ్యాన్ని బుక్కినవారినెవ్వరనీ వదిలే ప్రసక్తే లేదని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్..మరోమంత్రి హెచ్చరించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం మెడకు రేషన్ బియ్యం వివాదం చుట్టుకుంది. మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో నాని సతీమణి పేరుతో ఉన్న గోడౌన్‌లో బియ్యం మిస్సింగ్ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. పేర్ని నాని కుటుంబానికి చెందిన గోడౌన్‌లో 187 టన్నుల రేషన్ బియ్యం మాయమయ్యాయి. అయితే, తమ గౌడౌన్‌లో మాయమైన బియ్యం ధర ఎంతో చెప్తామని కృష్ణాజిల్లా జేసీకి లేఖ రాయడం సంచలనంగా మారింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో గత నెల 28, 29 30 తేదీల్లో పౌర సరఫరాల శాఖ అధికారులు ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు చేపట్టగా 187 టన్నుల తేడా ఉన్నట్లుగా గుర్తించారు. కోటి డెబ్బై లక్షల రూపాయలు చెల్లించాలంటూ నోటీసులు పంపారు . దీంతో మాజీ మంత్రి పేర్ని నాని కోటి రూపాయల డీడీలు తీయించి ఈ నెల 14న జేసీ కార్యాలయంలో అందజేశారు. మరో 70 లక్షల రూపాయలను సోమవారం చెల్లించారు. మొత్తంగా రెండు విడతల్లో కలిపి రూ. 1.7 కోట్ల డీడీలను అధికారులకు అందజేశారు. ఈ వ్యవహారంలో గోడౌన్ ఓనర్ గా ఉన్న జయసుధ పై క్రిమినల్ కేసు నమోదు చేశారు పోలీసులు దీంతో పేర్ని సతీమణి జయసుధ, తనయుడు కృష్ణమూర్తి అజ్ఞాతంలోకి వెళ్లారు. మచిలీపట్నం జిల్లా కోర్టులో జయసుధ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణను ధర్మాసనం తిరిగి 19కు వాయిదా వేసింది. రెండు రోజులు తర్వాత పేర్నినాని అజ్ఞాతం వీడారు. సోమవారం తన ఇంటికి చేరుకోవడంతో వైసీపీ నేతలు ఆయనను పరామర్శించారు . బియ్యం లెక్కల్లో తేడాలు ఎందుకు వచ్చాయో తనకు తెలియదని పేర్ని నాని అంటున్నారు. తాము తప్పు చేయలేదు కాబట్టే బియ్యం మాయంపై లేఖరాశామని పేర్నినాని చెప్పారు.మరోవైపు పేర్ని జయసుధ పేరుతో రేషన్ నిల్వలు ఉన్న గోడౌన్ ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని మార్కెటింగ్ గోడౌన్లకు తరలించారు. తర్వాత లెక్కలు చూసి తేడాలుంటే కేసులు పెడతామని అధికారులు అన్నారు. పేర్నినాని కేసులో కక్ష సాధింపులేమీ లేదన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్.. 4వేలకు పైగా బ్యాగులు మిస్ అయినట్టు గుర్తించామన్నారు. దర్యాప్తు తర్వాత చట్టప్రకారం పేర్ని నాని కుటుంబంపై చర్యలుంటాయన్నారు. మరోవైపు తమ నేతలను కూటమి ప్రభుత్వం టా÷-గ్గ్ం÷ట్ చేసిందంటోంది వైసీపీ. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే వేధింపులకు పాల్పడుతుందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తంగా స్టెల్లా అనే నౌకలో ఈ బియ్యం దొరకడం మరో ట్విస్ట్. మొత్తంగా గత ఐదేళ్లుగా బియ్యాన్ని సముద్రాన్ని దాటించారు. తెలంగాణలో సైతం హోటళ్లకు ఈ బియ్యం కల్పతరువుగా మారింది.

# ఎవరున్నా, లేకున్నా సరే.. జగన్‌కు అంత ధీమా ఏంటో!



అమరావతి,దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకోవాలి అనే నానుడి అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు సరిగ్గా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇదే జరుగుతోంది. ఎందుకంటే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలై 11 మంది ఎమ్మెల్యేలకే పరిమితం కావడంతో ఓడిన కీలక, ముఖ్య నేతలు, సీనియర్లు, మాజీ మంత్రులు, ద్వితీయ శ్రేణి నేతలు, కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో క్యాడర్ సైతం జంపింగ్ చేసేస్తున్న పరిస్థితి. అయితే ఎవరున్నా, లేకున్నా జెండా మోసే కార్యకర్త, అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రం ఎప్పటికీ పర్మినెంట్ అనే డైలాగ్‌ను గుర్తు చేసుకుంటూ క్యాడర్ ముందుకెళ్తున్నది. ఇదే క్రమంలో టీడీపీ, జనసేన పార్టీలు చేరికలతో హౌస్ ఫుల్ అవుతున్న పరిస్థితులు కూడా చూసస్తానే ఉన్నాం. ఇవన్నీ ఒక ఎత్తయితే వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నప్పటికీ ఈ పార్టీలోనూ చేరడానికి సీనియర్లు, మాజీలు రంగం సిద్ధం చేసుకుంటూ ఉండటం గమనార్హం. దీంతో అధినేత మాత్రం ఒకరు పోతే వంద మంది తయారు చేస్తానన్న ధీమాతో క్యాడర్‌ను కాపాడుకుంటూ, రానున్న ఎన్నికలకు సిద్ధం అంటూ ప్రజాక్షేత్రంలోకి వచ్చేస్తున్నారు.

అవన్నీ మామూలే..

ఎన్నికల ముందు, ఫలితాల తర్వాత నేతలు జంపింగ్‌లు చేయడం పరిపాటిగా వస్తున్నదే. ఇది అన్ని రాజకీయ పార్టీల్లో ఉండేదే. ముఖ్యంగా 2014 ఎన్నికల్లో ఇక చాలు బాబోయ్ అనేంతలా 23 మంది సిట్టింగ్‌లు వైసీపీకి గుడ్ బై చెప్పేసి సైకిలెక్కేశారు. దీంతో ఇంకా వైసీపీ బతికి బట్ట కడుతుందా? అని చర్చించు కుంటున్న సమయంలో, ఐదేళ్లు తిరగక మునుపే వైసీపీలోకి అంతకుమించి నేతలు జంప్ అయిన పరిస్థితి. దీంతో సీన్ రివర్స్ అయినట్లు అయ్యింది. ఆఖరికి 2019 ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలో, ఎవర్ని పక్కనెట్టాలో కూడా దిక్కుతోచని స్థితి వైసీపీకి వచ్చి పడింది. పార్టీలు మార్పు, చేరికలు అని మామూలు గానే నడుస్తుంటాయ్. ఇవాళ ఈ పార్టీలో ఉన్న నేత రేపొద్దున్న ఎప్పుడు కండువా మార్చేసి ఉంటారో కూడా ఎవరికీ తెలియని పరిస్థితులు సైతం అందరూ చూసే ఉంటారు. 2024 ఎన్నికల తర్వాత కూడా ఇదే పరిస్థితి ఏపీలో నెలకొంది. వైఎస్ జగన్‌కు వరుస షాకులిస్తూ చచ్చే వరకూ పార్టీలోనో ఉంటానని, చచ్చాక వైసీపీ కండువానే కప్పుకుని పోతానని చెప్పిన నేతలే జంప్ అయిన వారిలో ఉన్నారు, ముహూర్తం ఫిక్స్ చేసుకుని కండువా మార్చడానికి సిద్ధమై కూర్చున్నారు. సరైన సమయం రావాలే కానీ జంప్ కావడానికి రెడీగా ఉన్న లీడర్లు లెక్కలేనంత మందే ఉన్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

హౌస్ ఫుల్!

ఎన్నికల ముందే మొదలైన జంపింగ్‌లు, వైసీపీ ఓడిన తర్వాత ఇంకాస్త పెరిగి, నాన్ స్టాప్‌గా కొనసాగుతూనే ఉన్నాయి. అటు టీడీపీ, ఇటు జనసేనలోకి కండువాలు కప్పేసుకుంటున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకూ ఎక్కడికక్కడ సేఫ్ జోన్‌లోకి వెళ్లిపోతున్నారు. టీడీపీ కాదంటే జనసేన ఇక్కడా రెడ్ సిగ్నల్ బీజేపీ అన్నట్లుగా నేతలు వెళ్లిపోతున్నారు. కొత్త నేతల రాకతో పాత నేతలతో పంచాయితీలు కూడా నడుస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల చేరికలను సిట్టింగ్‌లు వ్యతిరేకిస్తుండటం, ఆఖరికి కొట్టుకుంటున్న ఘటనలు కోకొల్లలు. ఈ పరిస్థితి క్యాడర్ మధ్యే కాదు నేతల్లోనూ ఉంది. ఇప్పట్లో ఈ చేరికలు, గొడవలకు ఫుల్ స్టాప్ పడేలా కనిపించట్లేదు. మళ్లీ ఎన్నికలు వచ్చేంతవరకూ నేతలు పాలి'ట్రిక్స్' చేస్తూనే ఉంటారంతే. అయితే మారిన తర్వాత కూడా ఐదేళ్లపాటు అదే పార్టీలో ఉంటారా అంటే అదీ ప్రశ్నార్థకమే. ఎందుకంటే నామినేటెడ్ పదవో, ఏదో ఒక రీతిన లాభం చేకూరేలా ఉంటే తప్ప ఆయా పార్టీల్లో మసలుకోలేని పరిస్థితి అయితే నేతల్లో ఉంది. ఇందుకు చక్కటి ఉదాహరణే వైసీపీ నుంచి జంప్ అయిన మాజీ మంత్రి, సీనియర్ నేత. పార్టీ మారగానే ఎమ్మెల్సీ అని ఆ తర్వాత మంత్రి పదవి కూడా దక్కుతుందని ఎంతో ఆశపడ్డారు కానీ అవన్నీ అడియాసలే అయ్యాయి. మరోవైపు అధికారంలో ఉన్న పార్టీలతో మనకెందుకులే అని వ్యాపారాలు కాపాడుకోవడానికి, స్థానికంగా భయపడి వెళ్లిపోతున్న వాళ్లు ఎంత మందో లెక్కేలేదు. భారీగా, ఊహించని రీతిలో చేరికలు ఉంటాయని తెలుగు తమ్ముళ్లు చెప్పుకుంటూ ఉన్నారు.

జగన్ ధీమా ఏంటి?

ఎన్నికల ముందు, ఆ తర్వాత, ఇప్పటికీ వైసీపీ నేతల జంపింగ్‌లు సాగుతూనే ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే నియోజకవర్గాలు, కొన్ని జిల్లాల్లో వైసీపీకి పెద్ద దిక్కు అనేదే లేకుండానే పోయింది. అయినా సరే అధినేత మాత్రం ధీమాగానే ఉన్నారు. ఎందుకంటే 2019, 2024 ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను చూస్తే చాలామందే సాధారణ కార్యకర్తలు, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునేవాళ్లే ఉన్నారు. ఒకరు పోతే వంద మందిని తయారు చేస్తాననే నమ్మకమే జగన్ ధీమాకు కారణమని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటూ ఉంటారు. అంతేకాదు వైసీపీకి యువ రక్తం ఎక్కిస్తే ఇంకాస్త ఊపు ఉంటుందనే ఆలోచన సైతం అధినేతకు ఉందని మరికొందరు చెబుతున్నారు. అయినా పార్టీ ఆవిర్భావం సమయంలో, ఆ తర్వాత ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ మాత్రమే గెలిచారు, ఉన్నారు కూడా. ఆ తర్వాతే పార్టీకి అమాంతం ఆదరణ రావడం, అప్పటి వరకూ రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ మొత్తం ఖాళీ అవ్వడం మొదలైంది. అందుకే ఎవర్నీ తక్కువ అంచనా వేయలేం, వేయకూడదు కూడా అని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. ఇవన్నీ ఒకెత్తయితే ఇప్పటి వరకూ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు పక్క చూపులు చూడకపోవడం కాసింత పార్టీకి ప్లస్ అనే చెప్పుకోవచ్చు.

ఇది కదా ట్విస్ట్ అంటే?

రాష్ట్రంలో వైసీపీ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని, అధికారంలో ఉన్నప్పుడు ఆహా, ఓహో అని జగన్‌ను పొగిడిన నేతలే నేడు జగన్ వ్యవహార తీరు బాగాలేదని విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో కోటరీని మొత్తం పక్కనెట్టడం, నేతలు, కార్యకర్తలు, అభిమానులతో నేరుగా కలుసుకోవడం, జనంలోకి వస్తుండటంతో ఇప్పుడిప్పుడే పార్టీ గాడిన పడుతోందనే మాటలు వినిపిస్తున్నాయి. దీనికితోడు యంగ్ లీడర్ కావడంతో భవిష్యత్ కోసం యువ నేతలు, సీనియర్లు, మాజీలు ఇతర పార్టీల నుంచి రావడానికి సిద్ధమయ్యారంటే ఇదొక ట్విస్టే అని చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన నేత శైలజానాథ్ ఆయన ఇప్పుడు వైసీపీ కండువా కప్పుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇంకా రాయలసీమలో పదుల సంఖ్యలో నేతలు ఇదే బాట పట్టడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఉత్తరాంధ్ర, కోస్తాలోనూ జగన్ సమక్షంలో చేరడానికి, జనంలోకి వచ్చాక కండువా కప్పుకుంటారనే చర్చ జరుగుతోంది. అటు టీడీపీ, జనసేనలో హౌస్‌ఫుల్ అవుతున్న కొద్దీ, ఇటు వైసీపీకి యువ రక్తం, సినియార్టీని జగన్

# కొత్త ఏడాదిలో మహాకుంభమేళా...



అలహాబాద్,కొత్త ఏడాదిలో కుంభమేళా పలకరించబోతున్నది. అయితే ఇక్కడ మార్గదర్శకాలు ఇప్పుడు చ ర్చగా మారాయి. ప్రయాగ్‌రాజ్ లోని మహా కుంభమేళా మరోసారి వార్తల్లో నిలిచింది. కొత్త సంవత్సరంలో జరగనున్న మహా కుంభమేళా లో సనాతనయేతరుల ప్రవేశాన్ని అఖారా పరిషత్ నిషేధించిన తరువాత, ఇప్పుడు నాగ సన్యాసులు కూడా కొత్త మార్గదర్శకాలను వెల్లడించారు. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. సనాతనేతరులు ఎవరైనా మన సంస్కృతితో ఆటలాడినా లేదా జాతర ప్రాంతంలోకి ప్రవేశించినా వారిని పట్టుకుని కఠిన శిక్షలు వేస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్యపై తామే చర్యలు తీసుకోగలమని నాగ సన్యాసులు చెబుతున్నారు. ఇంతకు ముందు కూడా సనాతనేతరులు మహాకుంభంలోకి ప్రవేశించకుండా నిషేధం విధిస్తున్నట్లు అఖారా పరిషత్ ప్రకటించింది. ఇప్పుడు నాగ సన్యాసులు.. అఖారా పరిషత్ ప్రకటనకు మద్దతిచ్చి దాన్ని అమలు చేసే దిశగా గట్టి అడుగులు వేశారు. మహా కుంభమేళాలో పాల్గొనే వారు నుదుటిపై తిలకం, మణికట్టుపై కాలవ తప్పనిసరి అని.. సందర్శకుల మహా కుంభమేళా ప్రాంతంలోకి ప్రవేశం చడానికి ఇవి ఉన్నవారికి మాత్రమే అనుమతించబడతారని స్పష్టం చేసింది. హిందూ మతాన్ని భ్రష్టు పట్టించే ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నట్లు జునా అఖారాకు చెందిన నాగ సన్యాసి శంకర్ భారతి తెలిపారు. మత స్వచ్ఛతను కాపాడేందుకే ఈ మార్గదర్శకాన్ని అమలు చేశామని చెప్పారు. దీన్ని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఖారా స్‌లోని అన్ని ప్రవేశాల వద్ద పోలీసులను మోహరింప జేస్తామని.. తాము చేసిన మార్గదర్శకాలను పాటించేలా చూస్తామని నాగ సన్యాసులు చెప్పారు. ఎవరైనా దోషులుగా తేలితే శిక్ష అనుభవించాల్సిందే నని చెప్పారు. అఖారాకు చెందిన మహిళా సన్యాసి దివ్య గిరి ఈ మార్గదర్శకానికి మద్దతు ఇస్తూ మహిళా సన్యాసుల అఖారాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. అఖారా వెలుపల ఒక మహిళా సాధువును ఉంచుతామని వారు వారి నుదిటిపై తిలకం పెట్టుకున్న తర్వాత మాత్రమే లోపలికి అనుమతించనున్నామని చెప్పారు. రతీయ సంస్కృతి త్రివేణీ సంగం పవిత్రతను కాపాడేందుకు ఈ చర్య తీసు కున్నట్లు నాగ సన్యాసులు స్పష్టం చేశారు. నాగ సన్యాసిలు తమ అఖారాలు దీనితో సంబంధం ఉన్న సాధువులు మొత్తం జాతర ప్రాంతాన్ని గమనిస్తారని చెప్పారు.

# ఏడాదిలో ఎన్ని పనులు చేసినట్లు..రేవంత్ సంకల్పంతో సాగితేనే లక్ష్యసాధన



హైదరాబాద్, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. అయితే ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు. మంత్రుల మధ్య సమన్వయం కనిపించడం లేదు. అలాగే ప్రతి విషయానికి ఢిల్లీ నుంచి అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి తప్పడం లేదు. అక్కడికి వెళ్లి దర్శనం చేసుకోవడం తప్పడం లేదు. హామీలపై విపక్షాలు నిలదీస్తున్నాయి. కాంగ్రెస్ గట్టిగా మాట్లాడలేని పరిస్థితి కనిపిస్తోంది. స్వరాష్ట్రంలో పదేళ్లుగా ఎదురే లేదనుకున్న గులాబి పార్టీని ఓడించి, తెలంగాణకు రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఇక అంతే దూకుడుగా రేవంత్ రెడ్డి పాలనలో దూసుకుపోతున్నా..కార్యాచరణలో మాత్రం దాని ప్రభావం కానరావడం లేదు. ఈ క్రమంలోనే సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సవాలుగా మారుతోన్న వాతావరణ మార్పులను అధిగమించేందుకు రేవంత్ రెడ్డి ఈ దిశగా అడుగులు వేస్తున్నారు. మూసీ పునరుద్ధరణ, సుందరీకరణ ఇందులో ప్రధానమైనది. హైడ్రా ఏర్పాటుతో హడలెత్తించినా..అంతగా ఫలితాలు కానరావడం లేదు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పునరుద్ధరణ, పునరుత్పాదక ఇంధనం తోపాటు తెలంగాణకు పచ్చదనం భవిష్యత్ తరాలకు అందించేందుకు కీలక ముందడుగు వేశారు. పర్యావరణ పునరుద్ధరణలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ముఖ్యమైన ప్రాజెక్టుల్లో సరస్సులు, చెరువుల పునరుద్ధరణ ప్రధానమైంది. ఒకప్పుడు చెరువులకు, సరస్సులకు పెట్టింది పేరైన భాగ్యనగరంలో కబ్జాల కారణంగా చెరువులు, కుంటలు కుదించుకుపోయి, ఉనికిని కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో ప్రత్యేక వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీంతో చెరువుల్లోని అక్రమ కట్టడాలను పని పడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరు 75 చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ మహానగరం పరిధిలోని మొత్తం 2000 చెరువుల రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నిర్జీవమైన నీటి వనరులను పునరుద్ధరించనున్నారు. జీవవైవిధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు భూగర్భ జలాలు నిండేలా ప్రణాళికలు చేస్తున్నారు. వలస పక్షులను తిరిగి తెలంగాణ గడ్డపై విహరించేలా ఎ÷-లాన చేస్తున్నారు. చెరువులకు కొత్త శోభ తీసుకురావడంతో ఫ్లెమింగోలు, రెడ్ బ్రెస్టెడ్గ్ ÷÷-లక్యాచర్ వంటి జాతులకు చెందిన పక్షులు తిరిగిరావాలని భావిస్తున్నారు. పర్యావరణ పునరుద్ధరణతో పాటు మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూర్చనుందని ప్రకృతి ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. జీవ వైవిధ్యానికి సరైన చిరునామా అమీన్‌పూర్ చెరువు. రకరకాల పక్షులు, జంతువులకు నిలయం ఇది. ఏకంగా 350 ఎకరాల్లో విస్తరించిన అమీన్‌పూర్ చెరువు.. పెద్దచెరువు, కొత్తచెరువు, కొమ్ముచెరువు అనే మూడు చెరువుల గొలుసుకట్టు. ఇంత పెద్ద చెరువును కబ్జాలకు గురైంది. పెద్ద చెరువు నుంచి తూముల ద్వారా వచ్చే నీటిని సైతం కబ్జాదారులు మూసివేశారు. కొత్త చెరువును దాదాపు ఆనవాళ్లు లేకుండా చేశారు. ఈ మధ్య పెద్ద చెరువుకు సబంధించిన అలుగు, తూములు మూసివేయడంతో వర్షం వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందిపడుతున్నారు అమీన్‌పూర్ వాసులు. దీనికితోడు పశుపక్షాదులకు నిలయమైన అమీన్‌పూర్ వలస పక్షులు అంతరించి పోతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమీన్‌పూర్ చెరువు వద్ద కనిపించిన అరుదైన రెడ్ ఫ్లైక్యాచర్‌కు సంబంధించిన చిత్రాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పర్యావరణ పునరుద్ధరణ కోసం సాగుతోన్న కార్యక్రమాలకు ఇది సాక్ష్యమని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అమీన్ పూర్ చెరువుకు పూర్వవైభవం రావటమే కాకుండా.. జీవ వైవిధ్యం కూడా తిరిగి సంతరించుకుంది. ఇందుకు నిదర్శనమే..్ల లక్యాచర్ లాంటి అరుదైన జాతి పక్షులు ఇక్కడికి విచ్చేయటమే అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయితే ఇక మిగిలింది నాలుగేళ్లు.. ఈ కాలంలో చేయదగిన పనులు ఎన్నో ఉన్నాయి. వీటిని ఎలా ఒడ్డెక్కిస్తారన్నది కూడా ముఖ్యమే.

### పరిటాల హత్య కేసులో ముద్దాయిలకు బెయిల్

అమరావతి,పరిటాల రవి హత్య కేసులో నిందితులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది . ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురు ముద్దాయిలకు నాడు హైకోర్టు బెయిల్ మంజూరు చేసి ఊరటనిచ్చింది. 18 ఏళ్ల తరువాత ముద్దాయిలకు హైకోర్టు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. రవి హత్య కేసులో బెయిల్ పొందిన నిందితుల్లో పండుగ నారాయణరెడ్డి, రేఖమయ్య, బజన రంగనాయకులు, వడ్డే కొండ, ఓబిరెడ్డి ఉన్నారు. వీరంత గురువారం నాడు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది.

# కమలంలో కీలక మార్పులు.. నడ్డా ప్లేస్‌లో అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి?



హైదరాబాద్, బీజేపీలో కీలక మార్పులు జరగనున్నాయా? పార్టీ జాతీయ కొత్త అధ్యక్షుడి కోసం ఎంపిక మొదలైందా? బీజేపీ అంటే కేవలం నార్తిండియా పార్టీగా ముద్ర పడిపోయిందా? దాన్ని తొలగించే పనిలో పడిందా? వచ్చే ఎన్నికలకు బలపడాలంటే సౌత్‌కి అధ్యక్ష పీఠం ఇవ్వాల్సిందేనని కొందరు నేతలు హైకమాండ్ దృష్టికి తెచ్చారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.ఉత్తరాధిలో కమలం పార్టీకి ఈసారి ఎదురీత తప్పదనే సంకేతాలు బలంగా వినిపిస్తు న్నాయి. దీని నుంచి గట్టెక్కేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ హైకమాండ్. సౌత్‌లో నేతకు అధ్యక్ష పీఠం ఇస్తే బాగుంటుందని ఆలోచన చేస్తోంది. ఇప్పటికే దక్షిణాది నుంచి వెంకయ్యనాయడు, బంగారు లక్ష్మణ్ మాత్రమే అధ్యక్ష పదవి చేపట్టారు.ఇక తమిళనాడు, కేరళ వైపు చూసినప్పటికీ అనుభవమున్న నేతలు పెద్దగా లేరు. దీంతో బీజేపీ పెద్దల దృష్టి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై పడింది. ఆయనైతే ఎలా వుంటుందనేది ఆ పార్టీ చర్చ జరిగింది. దశాబ్దాల తరబడి ఆయన పార్టీని నమ్ముకోవడం ఒకటైతే, విధేయుడిగా ఉంటూ వస్తున్నారు. ఏనాడూ పార్టీ లైన్ దాటిన సందర్భం లేదు. మోదీ కేబినెట్‌లో మంత్రి పదవులు చేపట్టారు.కిషన్‌రెడ్డికు బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి ఇస్తే.. సౌత్‌లో పార్టీకి ఊపు వస్తుందని భావిస్తున్నారట. దీనికితోడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉన్నారని చెబుతున్నారు. ఈ చర్చంతా 20 రోజుల కిందట ఢిల్లీలో జరిగింది. దీనిపై వారం కిందట కిషన్‌రెడ్డితో జేపీ నడ్డా భేటీ కావడం వెనుక ఇందులో భాగమేనని అంటున్నారు.అంతా అనుకున్నట్లుగా జరిగితే మరో రెండు నెలల్లో కాబోయే జాతీయ అధ్యక్షుడిపై క్లారిటీ రావచ్చని అంటున్నారు. కిషన్‌రెడ్డి అధ్యక్ష పదవి విషయంలో ఆర్‌ఎస్ఎస్ సానుకూలంగా ఉందన్న సంకేతాలు లేకపోలేదు.కిషన్‌రెడ్డి పార్టీ అధ్యక్ష పదవి చేపడితే తెలంగాణ పరిస్థితి ఏంటనే దానిపై నేతల మధ్య చర్చ జరిగిందట. కేసీఆర్ కమ్యూనిటీకి చెందిన వ్యక్తిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా నిలబెడితే బాగుంటుందనే ఆలోచన చేస్తోందట. పార్టీ అధికారంలోకి రాకపోయినా కనీసం ప్రతిపక్షంగానైనా ఎదిగేందుకు ఛాన్స్ ఉంటుందని లెక్కలు వేసుకుంటోందట కమలం పార్టీ. రాబోయే రోజుల్లో కమలం పార్టీలో ఇంకెన్ని మార్పులు చోటు చేసుకుంటాయో చూడాలి.

# ఎఐసిసి పిలుపుమేరకు చలో రాజ్ భవన్ :డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ





హైదరాబాద్ :ఏఐసీసీ పిలుపుమేరకు రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమానికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు అధ్యక్షతన మంత్రులు మరియు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ గారు పాల్గొన్నారు.అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో అదాని కలిసి దేశ సంపదను కొల్లగొట్టారని దేశాన్ని అభివృద్ధి పథంలో కాకుండా అవినీతి పతంలో దూసుకుపోతున్నారన్నారు . మణిపూర్ ఘటనలో కేంద్ర ప్రభుత్వం తీరు చాలా బాధాకరమన్నారు . రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కాంగ్రెస్ సైనికుల దేశం ప్రతిష్ట కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు దేశం బాగుంటే ఉంటే రాష్ట్రం బాగుంటుందన్న భావజాలంతో ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారు అధ్యక్షతన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి రాష్ట్రం కోసం ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన ముఖ్యమంత్రి ప్రజల కోసం చేస్తున్న కార్యక్రమాలు చాలా సంతోషమని కాంగ్రెస్ కార్యకర్తలకు రేవంతన్న రోల్ మోడలని చెబుతూ అదానీ కుంభకోణాలపై జేపీసీ వేయాలన్న డిమాండ్లతో ఈరోజు రాజ్ భవన్ కు మార్చ్ ఫాస్ట్ చేయడం జరిగిందని రామకృష్ణ గారు తెలియజేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com